సరిహద్దులు

'శ్రీపతి'

ప్రియుని ఆలింగనంలో చీకటిచిన్మయానందాన్ని పొందుతోంది. వెన్నెలరేడు చీకటిని తనలోదాచుకొని పరవశంగా చూస్తున్నాడు. ఉత్తరపవనం ప్రేమసందేశాలని గొంతువిప్పి పాడుతూ పోతూంది. మాతృత్వవాంఛతో వరిపైరు ఆ ఆహ్లాద వాతావరణానికి మైమరచి నృత్యంచేస్తోంది. దూరాన కొండలు ప్రోగులుగా పడ్డ కారుమేఘాల్లా నల్లగా పడివున్నాయి. చెరుకు తోటల్లోని కాపలాకుర్రాళ్ళచేత అనేక రాగాలు తీయిస్తోంది రాత్రి. సముచిత జంత్రసమ్మేళనంలా రాత్రి పిట్టల కూతలు, నక్కల అరుపులు, చెరుకు తోటల్లో సవ్వడి చేస్తున్న మారుతం, పైరుపాట అన్నీ సమకూడాయి.

గ్రామానికి దక్షిణాన, ఫర్లాంగ్ దూరాన, ఆ చుట్టుపక్కల పొలాలకు పదడుగుల యెత్తున మెరకమీద, పలచగా పెరిగిన చెట్లమధ్య, ఆ బహుళజ్యోత్స్నలో మెరుస్తున్న పూర్ణకుండం ఓ దేవీ ఆలయానికి నిదర్శనంగా వుంది. ఆ ప్రక్కనే గదిలో పూజారి.

ఆ సమయం, వాతావరణం, పరిసరాలు అన్నీ సూరన్న తాతకి కొత్త. అలాంటి సమయంలో ఆ ప్రదేశానికి రావాల్సి వుంటుందని జీవితంలో యేరోజూ కలగనలేదు. ఆ ఉదయం సంఘటన కల్పించిందలా.

ఆ శరీరం మూడు పాతికలు దాటిన అనుభవాలని ధ్రువపరుస్తోంది. చేతిలోని కర్ర టిక్కు టిక్కుమని భూమిని, కాలాన్నీ వెనక్కి నెట్టుతోంది. సూరన్నతాతముందు దృఢంగా యింకో ఆకారం దారిచూపుతోంది.

ఆలయానికి చేరువయారు. గుడిమంటపంలో రెండు నీడలు స్పష్టంగా చూస్తేకాని అనుమానించటానికి ఆధారాల్లేవు. అవి కదులుతున్నాయి. సూరన్న తాతకి అంత పరీక్షతో చూసే దృష్టి పోయింది. ఆ ప్రాంతంలోని భయం ఊహించి చూడలేదు రెండోవాడు. గుడికి చేరువయారు. హేమంతం కావలించుకొని గజగజలాడిస్తోంది. సూరన్నతాత అప్పటికే విసుగుచెంది 'యిదేనా?' అని అడిగాడు.

'ఆ!' అని ఆవ్యక్తి ఆలయానికి ఉత్తరానవున్న గది ముందు, పూల మొక్క దగ్గర నిల్చొని 'నూకయ్‌గారూ' అని పిలిచాడు.

ఆలయమంటపంలోని నీడలు కదిలాయి—బయట వ్యక్తులను చూసినట్టు.

నూకయ్యగారు లేచి తలుపు తెరచుకొని 'యెవరు?' అన్నారు గంభీరంగా. అప్పటికింకా ఆయన నిద్రపోవడం లేదు. కొండగాలికి జడిసి తలుపు వేసుకొని లోపల కూర్చొని ప్రార్థన చేసుకొంటున్నారు. ఇంతలో బయట కేక—

'మేష్టారికోసం యీ తాతొచ్చారు—'

'అలాగా? సరే రండి లోపలికి. మేష్టారు యింతలోనే వస్తారు—' అని ఆహ్వానించారు.

'నే నెళ్తానండీ నూకయ్‌గారూ—' అని ఆయన వెన్నెల్లో నీడయి మాయమయాడు అక్కడినించి.

సూరన్నతాత లోపలికి వచ్చాడు. కోడి గుడ్డు లాంతరు వెలుగుతోంది. చిన్న గది. ఓ పక్కన మంచం. ఒకటే ద్వారం పశ్చిమాన. దక్షిణాన కిటికీ. తూర్పు గోడపక్క వంటపాత్రలూ, పెట్టెలూ, డబ్బాలూ. ఉత్తరగోడకి ఐదడుగుల యెత్తున నాలుగడుగుల బల్లమీద పుస్తకాలు అందంగా అమర్చబడివున్నాయి. మంచంపక్క పరచబడివున్న పరుపులో కూచోమన్నారు నూకయగారు. సూరన్నతాత కూచున్నాడు—ఆదినం పడ్డ ఆవేదనకి నిట్టూరుస్తూ, కర్రని ఆ ప్రక్కనే పెటుతూ.

* * *

'అవును. మాతాతే!'

'ఎందుకొచ్చారు?' అంది. ఆ పలకటంలో ఆకర్షణ వుంది. ఆమె ఒరియా ఉచ్చారణ లేవో తెలుగుని అందం చేస్తున్నాయి.

'ఒక్కసారి పాత కథ గ్యాపకం తెచ్చుకో—యెందుకొచ్చారో అర్థమవుతుంది.'

'మీ రూహించినట్టే—'

అతను కింద మెట్లపై కాళ్ళు పెట్టుకొని కూచున్నాడు. అతని ఒడిలో ఆమె తల పెట్టుకొని అతని కళ్ళనీ, తారకలనీ తరచు చూస్తోంది. ఆమెని నిమురుతున్న అతని కుడిచేయి వ్రేళ్ళని తన రెండు చేతులుతోనూ పట్టుకొని, పెదాలని మరోసారి తడుపుకొని—

'అయితే—' అని సహజమైన సంశయాన్ని స్త్రీ హృదయంలోని భయంతో కలిపి జార్చింది.

క్రింది మెట్టుకి పదిగజాల దక్షిణాన సమాధి. ఆ చుట్టూ పూల మొక్కలు. మందారాలు మాత్రం దట్టంగా పొదలు పొదలుగా వున్నాయి. ముఖ్యంగా టమాటో మొక్కలు బరువుగా నిండుగా వున్నాయి. అవి యెన్నో రకాల ఆకులు. ఆ

వెన్నెల్లో రంగుల భేదం తెలీకండా వుంది. తెరలుతెరలుగా సుగంధాలు ఆత్మల్ని పవిత్రం చేస్తున్నాయి.

'ఏంవుందీ?' తన ఆస్తి నెవరో దోచుకొనేందుకు వచ్చారనే బాధే అంతర్గతం అని తెలుసుకొని అభయంగా వీపు తట్టాడు—మూర్తి.

అసంతృప్తికరంగా, భయంగా వుందా సమాధానం —ఆమెకి.

'ఇపుడు నువు కనిపించావంటే యెలా వుంటుందో తెలుసా?' అన్నాడు.

ఆశ్చర్యంగా కనుల్లోకి చూస్తోంది. జారిపోతోన్న వేళ్ళని గట్టిగా పట్టుకొంటూ.

'భరించలేరు. శత్రువుని చూసినట్టు చూస్తారు. ఎక్కడో, యెవరో పాడుపని చేసేశారని అనుకొంటారు. సనాతనాచారాలక్రింద నలిగిపోయిన వీరికి యీ కాలం అంతా విరుద్ధంలా వుంటుంది. ఈ చదువుకోడాలూ, హరిజనసేవా, హోటల్ భోజనాలూ, కులాంతర్వివాహాలూ, ఆడా మగా నిర్భయంగా తిరగటం యివేవీ కిట్టవ్. అందుకే వాళ్ళు బాధపడిపోతారు.'

ఇంతలో నూకయ్‌గారు బయటికి వచ్చారు. పొయ్యి వెలిగించుతున్నట్టుంది. పక్కసాలలో వెలుతురు. సడుకొన్న దండాశి నూతివేపు వెళుతున్నాడు. గుడికి వాయువ్య దిశలో పాతికగజాలలో నుయ్యి వుంది.

'భోజనం లేదుగాబోలు వంట యేర్పాటులు చేస్తున్నట్టున్నారు—' అందామె లేచి కూచొని. గాజులు గలగలలాడినాయి. అరికిన్‌లాంతరు వెలిగించి సాలలో పెట్టారు.

'నే వంట చూస్తా—తాతగారిని కలుసుకొండి' అని లేచి నిల్చొంది.

ఈసడించే సవతితల్లి, నియంతృత్వ ధోరణిలో ఆత్మని బోధించే తండ్రీ, యేవిధంగానూ ప్రేమించలేని సవతి బిడ్డలూ, అంతవరకూ అసహ్యించుకొనే బంధువులు, పంకిలమయమైన సంసారజీవితం అతని స్మృతిలో కదిలింది.

చీర సర్దుకొని, జుత్తు ముడివేసుకొని కదులుతోంటే— 'చూడుకారుణ్యా—తాతగారు ఉద్రేకంలో యేమన్నా పట్టించుకోనని మాటియ్యి—' అని చేతులు పట్టి ఆపి, అతి వినయంగా కోరాడు. ఆమె వినిపించని నవ్వు నవ్వింది.

సుమసుగంధాలు శీతల సమీరాన్ని పెనవేసుకొన్నాయి.

'కారుణ్యా—' అని భావప్రకటనకు తడుముకొన్నాడు. 'యీ కష్టాలన్నీ చెపితే అర్థమౌతాయంటావా? అందుకే నేనేమీ మాట్లాడదలంచలేదు. ముఖ్యంగా తాతయ్యతో—' సమీరం విడిపోయింది. పరిమళం విరహం భరిస్తోంది. వెన్నెల ఆనందంలా ప్రకృతిని ఆవరించింది.

గదితలుపు తోసుకుని లోపలికి వచ్చాడు. సూరన్నతాత. మొహం తిప్పి చూశాడు. పెద్ద పొటాకుచుట్ట కాలుస్తున్నాడు. ఆ వెలుగులో నుదుట గీతలు నీడల్లా తయారయాయి. కళ్ళు దూరాన వెలుగుతున్న జ్వాలల్లా మిణుకుమిణుకు లాడుతున్నాయి.

కిటికీలోంచి లోపలికి చూసింది కారుణ్య. అదీ సంఘటన!

'మీరు వెళ్ళి కూచొండి నూకయ్‌గారూ. యింత ఉత్సాహం ఆదేవి యెలా యిచ్చేసిందో, యీ ముసలితనంలో—' అంది అతని చేతిలోని బియ్యం కడగటానికి తీసుకొంటూ.

'మూర్తి లోపలికి వెళ్ళాడా?' అంటూ కిటికీలోంచి చూశారు నూకయ్‌గారు.

విధిగా వేస్తున్న కుశలప్రశ్నలు వినిపించాయి. ఎవరూ మాటలు పొడిగించడంలేదు. సూరన్నతాత అలసిపోయినట్టు ఉన్నాడు. పట్టించుకొని వినేశక్తి కోల్పోయినట్టుంది ముఖభంగిమ.

మూర్తి రాబోయే ప్రతి క్షణమూ భయంకరమైన విపత్తుగా భావిస్తున్నాడు. కాని తాతయ్యంటే జాలితావుంది. ఓసారి తనకథ చెబుతూ సూరన్నతాతగురించి చెప్పిన విషయాలు కారుణ్యస్మృతుల్లోంచి లేచాయి. దగాపడిన తమ్ముడు సూరన్నతాత!

నూకయగారు సమాధివేపు వెళ్ళారు. టమాటాలు తెచ్చేందుకేనేమొ! మూర్తిలో భయం, సాహసం దంద్వయుద్ధం చేస్తున్నాయి. యింతవరకూ చేసిన నూతన సాహసం యీనాడువో వృద్ధునిముందు వీగిపోవాల్సిందేనా? తాతమీదవున్న గౌరవం కొద్దీ తను వేసుకొంటున్న కొత్తబాటనుంచి తిరోగమించాలా? అనురాగాలూ, ఆదర్శాలు అతనిలో భీకర మారణ యుద్ధం చేస్తున్నాయి.

అతని కళ్ళల్లో, కదలికల్లో అంత బాధా చూసి తెగిన ఆకులా రెపరెపలాడి రాలిపోతోంది కారుణ్య హృదయం. ఇంకోసమయంలో అయితే పిలిచి యెన్నో కబుర్లు చెప్పేదే— కాని—యే సరిహద్దునో అతిక్రమించలేకపోతోంది.

తాతయ్య యింకో పరిస్థితిలో వస్తే యెంతో అప్యాయత ఒలకబోసేవాడు మూర్తి. సంఘంలో తన స్థానాన్నీ ప్రయోజకత్వాన్నీ చూపించుకొని గర్వపడేవాడు. కాని యీ సందర్భంలో విలువలేదు. అందుకే అక్కడ యింక నిలవలేక బయటికి వచ్చేశాడు. సూరన్నతాత కాల్చిన చుట్టముక్కని పారేసి లేవబోయాడు.

'మీరు వెళ్ళి మాట్లాడండి నూకయ్‌గారూ—నే నీ పని చూస్తా'నంటూ అతని చేతిలోని టమాటాలు అందుకొని కారుణ్యముందు కూచున్నాడు బల్లపై.

కొంతసేపు చిలిపి చిలిపి ప్రశ్నలువేసి నూకయగారు చివరికి 'మూర్తిగారు యిక్కడ రెండేళ్ళనించి వుంటున్నారు గదా? మీరు—' అని అడగబోతున్న ప్రశ్న అంతం కాకుం

డానే జోక్యంచేసుకొని, 'ఆఁ.....అలా అన్నారా స్వామీ—' అని సూరన్నతాత కొంత ఆలోచించాడు.

తాతయ్య సంభాషణలు తరచు ఉపమానాలతో ఆరంభమవడం మూర్తికి బాగా గుర్తు. మాటలు, ఉపమానాలు సరిగ్గా పెట్టుకొనేందుకు కొంతసేపు మౌనం.

'ఆబోతు—స్వామీ వింటున్నారా? ఆబోతు వయసులోనికి రాగానే తండ్రి ఆబోతుని యేం చేస్తుంది స్వామీ?' మెల్ల మెల్లగా స్పష్టంగా ముగించి, మౌనం వహించి నాకయ్యగారి కళ్ళల్లోకి సూరన్నతాత చూడడం—చూసిన కారుణ్యకి తన స్వేచ్ఛ గాలానికి తగులుకొన్నట్టయింది.

'అవును' అని ఊరుకొని పూర్తివాదాన్ని వినేందుకు అతనివేపు చూస్తున్నారు నాకయగారు.

'అది పశువ్ గుణం—అవునంటారా స్వామీ?'

'ఆఁ అయితే?'

'మనం మనుషులం. అలాగే వినండి స్వామీ—అలాగే ప్రవర్తిస్తే మనకీ వాటికీ భేదం యెక్కడ?'

ఆ మాటలు విన్నపుడు సమాధానాలు పడగ విప్పాయి. పశువులకున్న చాలా సుగుణాలు మనుషులకు లేవని చెప్పాలనుకొంది. ఇంతలో పొంగొచ్చి నిప్పు 'సుయ్' మంది. పిడుగుపాటుకు తట్టుకొంటూ వింటూన్న మూర్తిలో పశ్చాత్తాపం పెరుగుతోంది. తను తండ్రిని మోసం చేశాడా? ఆబోతులా రంకె వేసి కాలు దువ్వాడా?

'స్వామీ—వినండి—యీనాడు నా కూతురు—చచ్చి స్వర్గాన్నుంది—'

అమ్మ మూర్తి మదిలో మెదిలింది.

'దాన్ని యీనాడు నా అల్లుడు—వింటున్నారా? కాకిగూట్లో కోయిల గుడ్లుపెట్టింది కాబట్టి—బాగా వినండి స్వామీ— ఆ కోయిలపిల్ల ఈ కాకిని మోసంచేసి వెళ్ళిపోయింది అని నిందిస్తున్నాడు. స్వామీ—నాకు తెలుసు—బావంటే దాని—కెంత గౌరవమో?'

నాకయగారు ఆ మాటల్లోని కథంతా వూహిస్తున్నారు. బయట కుక్క యెవరో దారిపోయేవారినిచూసి అరుస్తోంది. దండాశి కల్పించుకొని పనులు చేస్తున్నాడు. స్త్రీపై సహజంగా రుద్దే మాలిన్యపుదుర్గంధానికి తట్టుకోలేకపోతోంది. కారుణ్య. మూర్తి జడుడయాడు. తన తల్లి పవిత్రత గురించి చాలమంది శ్రేయోభిలాషులనోట విన్నాడు. చనిపోయిన తన తల్లి అంటే అతనికి యీ విశ్వం. తట్టుకోలేక విరుద్ధ రసభావభరితుడై, ఉగ్రుడయ్యాడు మూర్తి.

వెన్నెల క్రమంగా హెచ్చుతోంది. దూరాన జనం గోల. చెరుకుతోటల్లో యెలుగుబంటి ప్రవేశించినట్టుంది. ఆ గోల క్రమంగా దగ్గరౌతోంది.

నాకయగారు బయటికి వచ్చి చూసి, లోపలికిపోయి తలుపు మూసి మంచంమీద కూచున్నాడు. సూరన్నతాత పరీక్షతో అతన్ని చూస్తున్నాడు. చలిగాలి హెచ్చుతోంది.

'స్వామీ యింకొక మాట చెబుతాను వింటారా? మా పెద్దమ్మ కొడుకు ఒకడుండేవాడు. వాడంటే వూళ్లో అందరికీ భయం. ఎవరినీ కష్టపెట్టేవాడుకాడు—ఎవరు తప్పుచేసినా ఒప్పుకొనేవాడుకాడు. అంతటి మనిషి కూడ—స్వామీ—చెపితే నమ్మరు—మందెట్టేసింది—ఓకులట—అప్పటినించి ఆ గడప దాటి క్షణం బయటికి వచ్చేవాడు కాడు—'

ఏవేవో చచ్చాడన్నవరకూ చెప్పి నీతులతో కథ పాడిగిస్తున్నాడు సూరన్నతాత. కారుణ్య అమృతహృదయంలో విషశరం గుచ్చుకొంది. మరణవేదనతో ఆమె కనుల్లోంచి అశ్రువులు రాలుతున్నాయి. మందెట్టేసింది ఓకులట—మరీ మరీ వచ్చి నాటుకొంటున్నాయి ఆ మాటలు! ఇంతకుముందే యిలాంటి దెబ్బలు కొన్ని తగిలిన కారణంగా ఆమెలో కొంత ఓర్పు మిగిలింది. మూర్తి ఆకులట అనబడే స్త్రీగురించి ఊహిస్తున్నాడు. ఆమె యెంత గొప్ప కళాహృదయో? రూపవతో? ఆమె పలుకుల్లో ఏతత్వం విన్నాడో? ఏ గానం బంధించిందో? ఏమో! ఊహ వాస్తవికతను అందుకోవడం లేదు.

'స్వామీ—కొమ్ము లొచ్చాయని యీనాడు—' మాట పూర్తిచేయకుండా మౌనం వహించాడు. మూర్తి కోపం కొమ్ములు విప్పింది. ఇక్కడా తన ఆత్మకి శాంతి లేదు. జీవితాలని వ్యర్థంచేసే యీ బంధుత్వాలని క్షాళనచేసేయాలనే తన పట్టుదల పునః పునః వీగిపోతోంది. యిన్ని నీతులు బోధించే తాత తన ఒక్క కొడుకుని యెందుకు రక్షించుకోలేకపోయాడు? సన్యాసుల్లో చేరిపోతే యేమన్నా చేయగలిగాడా? తమ్ముడు సంసారం ఒలకబోసే పగలూ, ద్వేషాలూ భరిస్తూ నీచజీవితాన్ని గడిపే ఓ వ్యక్తి తత్వబోధచేస్తే సహించే వోర్మి మూర్తిలో శూన్యమౌతోంది.

'నేడు నా అన్నవాళ్ళని దూరంచేసుకొని—నా కెవరూ లేరనుకొంటే—' మళ్ళీ మౌనం. నిర్మలసాగరంలో రాళ్ళు పడి వలయాలు పెంచినట్టు మూర్తిలో ఆ మాటలు అనురాగాలనన్నిటినీ తట్టి లేపుతున్నాయి. సూరన్న తాతకి తెలుసు యీ తన సంభాషణంతా యెవరిపైనో, దాని ఫలితం యెలాంటిదో?

వంటయింది. నాకయగారు వడ్డనకి లేచారు. భోజనానికి తీసుకొచ్చేందుకు మూర్తి సూరన్నతాతవద్ద కెళ్ళాడు. ఆ ముసలాయన తిండి కనీసం తినాలంటే తను కొంచం దూరంగా ఉంటం అవసరం. అది గ్రహించి ఆమె మండపంవేపు పోబోతోంది. బయట అడుగుపెట్టిన సూరన్నతాత అదిచూశాడు. వెన్నెల్లో వేలాడుతున్న పూలమాలలా కన్పించింది.

భోజనం అంతసేపు నిందితునిలా నిశ్చేష్టితుడై నిల్చొని చూస్తున్న మూర్తివేపు కారుణ్య దృష్టి అంతా. నూకయగారి ఆదరణ, వడ్డన కొత్త ప్రేమలని పెంచుతోంది ఆత్మల్లో.

రొజ్జగాలి విజృంభించి తలుపు తట్టుతోంది వేగంతో.

అన్నయ్యతో కటక్‌లో చదువుకొన్న దినాలు, వదిన రాకతో అన్నయ్య ప్రవర్తనపై విసుగెత్తడం, విశాఖలో మామయ్యవద్దకు వెళ్ళడం, అప్పట్లోనే తెలుగు నేర్చుకోవడం, కాలేజీ చదువుకొంటున్న మూర్తితో పరిచయం, ఉద్యోగం కోసమని బరంపురం రావడం, పై ఆఫీసర్ అహంకారంతో ఉద్యోగం వూడడం, ఒంటరి బతుకుపై విసుగెత్తి తన పల్లెటూరిలోనే వుండిపోదలంచడం, రెండు నెలల క్రితం చనిపోయిన తల్లీ—అన్ని జ్ఞాపకాలూ, పొగల్లారేగి మానసికరోదసిని ఆక్రమించాయి—కారుణ్యలో.

భోజనం అయాక లోపలికి వచ్చి మరో పెద్ద చుట్ట పక్క జేబులోది తీసి వెలిగించాడు సూరన్నతాత. శాలువ కారుణ్యకిచ్చి పొయ్యి పక్కన పక్కవేసుకొని మేను వాల్చాడు దండాశి. నూకయగారు ప్రార్థనచేసుకొంటున్నాడు.

చాలసేపు కూచొన్న సూరన్న తాత పరుపుమీద సాగిలబడ్డాడు. కారుణ్య దండాశినిలేపి తనపక్క సాలలోకి తెప్పించుకొంది. సాలబయటికి మూర్తి పిలిచి 'కారుణ్యా! యింకా చాలా రకాల మాటలొస్తాయ్! నువు వినీ విననట్టు పడుకో. అదే నా యీనాటి కోరిక. లేకపోతే చాలా బాధపడతాను—'అని కళ్ళనీళ్ళ పర్యంతరమై బ్రతిమాలాడు.

ఇంతలో వారికి పాతిక గజాల దూరాన భయంకరమైన కేక. కారుణ్య తుళ్ళిపడింది. నూకయగారు చాల తేలిగ్గా తీసుకొన్నారు. సూరన్న తాత ఏమిటో అని ఆలోచిస్తున్నాడు. మూర్తి ఎవరో వ్యక్తి పడిపోవడం చూసి పరుగెత్తుకు వెళ్ళాడు. తెల్లగా సామాన్యమైన పొడవరి. పాతికేళ్ళ వయస్సు. సన్నగా వున్నాడు. అతనిగురించి వూర్లో చాలా మంది చెడ్డవాడుగా మాట్లాడుతారు. పాము కాటు వేసిందట! నూకయగారు మంత్రించారు. కారుణ్య గుండెలు భయంతో కొట్టుకొన్నాయి. ఏ దుర్బుద్ధితో వచ్చాడో? ఏ పగ సాధించడానికో? 'వెళ్ళిపో! అలా యెప్పుడూ రాకూడదు' అని చిన్నపిల్లవానికి నచ్చచెప్పినట్టు నూకయగారు చెప్పడం ఆ బాధలోకూడ కారుణ్యకి నవ్వు తెప్పించింది.

జరిగిన కథవిని సూరన్నతాత ఆశ్చర్యపోయాడు. ఈ మనుష్యుల్లోని యీర్ష్యాసూయలు అశాంతిని రేకొల్పాయి అతనిలో. నిద్ర పోబోయాడు. కాళ్ళు పీకుతున్నాయి. బస్ చెడింది. ఆరుమైళ్ళు నడిచి వచ్చాడు. కుర్రతనంలో యిరవై క్రోసులు సులభంగా నడిచేవాడు. కానీ యిపుడు చాలా మారిపోయాయి! ఏం చేయడం తోచక తనని తనే నొక్కుకోవడం చూసిన కారుణ్య గదిలోకి వచ్చింది. మూర్తి ఆశ్చర్యపోయాడు. తాత దృష్టికి దూరంగానే వుంచాలనుకొన్నాడు ఆమెని. కాని ఆమె యీ సాహసంతో కాలు కాలిన పిల్లిలా అవుతున్నాడు.

ఆకుపచ్చని శాలువా నిండుగా కప్పుకొని వుంది. సన్నంగా పొడవుగా ఉంది. సూరన్నతాత కాళ్ళముందు కూచొని కాళ్ళు నొక్కడం మొదలు పెట్టింది. తాతయ్య తిన్నగా పడుకొని 'ఎవరు నువ్వు?' అన్నాడు. అతని కడకాళ్ళపై గాజులు కిలకిల నవ్వుతున్నాయి.

తనెవరో యెలా చెప్పడమో తెలీక తికమకలాడుతోంది. రెండోసారి తాతయ్య ప్రశ్న కఠోరంగా తట్టింది.

'చెపుతాను తాతా' అని కొంత తడుముకొంది. తన నిశ్చయాన్ని బలపరచుకొని చివరికి, 'నీ మనుమరాలిని—' అని ముగించింది.

వికటంగా 'ఆ?' అని ఏ జాతి?' రెండో ప్రశ్న.

నూకయగారు, మూర్తి వింటున్నారు ఆ గదిలోని ప్రతి చిన్న సవ్వడినికూడ.

'మానవజాతి—' చాల సహృదయంగా ఆ మాటలు వినిపించినప్పటికీ సూరన్నతాతకి అసహ్యంలా ఐ 'ఆ?' అన్నాడు కటువుగా. 'హిందూస్త్రీని' అని కారుణ్య ముగించింది.

ఆ జవాబుతో చాలసేపుమాట్లాడే శక్తి కోల్పోయాడు సూరన్న తాత.

'తాతగారూ—మీరు పశువులుగురించి యింత సేపూ మాటాడారు గదా? ఆ పశువులకున్న మంచిగుణాలు యీ మనుషులకున్నాయా తాతగారూ?' అంది మాటలకు తడుముకొంటూ.

సూరన్నతాత ముసుగులోంచి కాళ్ళవేపు చూశాడు. నీడలో దాగిన ఆమె ముఖంమీద, దీపంవెలుతురు రేఖ గీసింది. సన్నని పొడవాటి ముక్కు. ఎత్తయిన నుదురు.

'ఏ పశువన్నా తనిచ్చిన పాలు, తన సేవా ఖరీదుకట్టి ఋణం తీర్చమన్నదా తన పిల్లలని? తాతగారూ?'

మూర్తికి భయం. ఆమె సాహసం, ఆ ప్రశ్నలూ వణికిస్తున్నాయి. ఎందుకు? ఆ పూర్వాపరాలు అడిగేంలాభం? తనకి నాన్న అన్న వ్యక్తి లేడని, తనని నమ్మిన ఓ వర్తకుడే యీలోకంలో తన నిన్నాళ్ళూ పెంచాడనీ, ఆ ఋణం తీర్చుకొనే శక్తి రాగానే తీర్చేయాలనీ అనుకొంటున్న మూర్తికి యీ ప్రశ్నలన్నీ తీగలాగి పొద కదుపుతున్నట్టయింది.

'తాతగారూ! నడి వీధిలో నలుగురి స్నేహితుల్లో ఆయనగారు వున్నప్పుడు వాళ్ళ నాన్న ఏమన్నారో మీకు తెలుసా? ఆ మాటలే—మీరే—మీ నాన్న నోట వినివుంటే—ఏమనేవారు? మీరేకాదు—ఎవరన్నా ఏమనేవారు?'

తాత వింటున్నాడు. మౌనం. ఏమిటా మాటలని ప్రశ్నించలేదు. కాని ఆమెకు తాత ప్రశ్నిస్తున్నట్టయింది—ఆ చూపుల్లో.

'ఇలాంటివాడిని యేదన్నా, ఎవరి చేతన్నా చేయించే యాలనిపిస్తుందండీ' అన్నారట! ఏం చేస్తారు? చంపిం చేస్తారు! అంతకంటే యింకేం చేయగలరు? కాని తాతగారూ, ఏ పశువూ తన బిడ్డలని, చంపించేస్తాననీ చంపేస్తాననీ, అనదు. ఆమె అనలేక అంటోందామాటలు. కాళ్ళు నొక్కుతూనే వుంది.

సూరన్నతాత జవాబేమీ చెప్పలేదు. ఆలోచిస్తున్నాడు. కొంతసేపటికి చాల్లే అని కాళ్లు ముడుచుకొన్నాడు. కారుణ్య లేచి తలుపు మూసికొని వెళ్ళిపోయింది. ఆమెమాటలతో తాత ఆలోచనలు పెరిగాయి.

అప్పటికే చంద్రుడు నడినెత్తిమీదకివచ్చి శీతలానికి వణుకుతున్నాడు.

'అవన్నీ యెందుకు? అడగాల్సిన అవసరమేమిటి?' అని నొచ్చుకొంటూ కారుణ్యని ప్రశ్నించాడు. 'ఎలా జరిగితే అలా జరగనీ—వాడొచ్చాడు—దుర్బుద్ధితోనో కాదో—అనుభవిం చాడు. మనం చెడు చేస్తే అనుభవిస్తాం—మంచి చేస్తే భగ వంతుడు మేలు చేస్తాడు' అని ముగించి కూచున్నాడు.

ఆ మాటలు ఆ నిశ్శబ్దంలో మెల్లగా వినిపించాయి సూరన్న తాతకి. అప్పటికే నూకయ్యగారు, దండాశి సుఖ తమ నిద్రలో వున్నారు.

* * *

తెల్లవారిందని తెలిసి చంద్రుడు తెల్లబోయాడు. సూర్యోదయం కాలేదు. కాని వెలుతురు. మంటపెట్టుకొని దండాశి నీరు వేడి చేస్తున్నాడు. మూర్తి నిద్రలోంచి లేవలేదు. తల నిండా దుప్పటి కప్పుకొని పడుకొని వున్నాడు. నూకయగారు తోటలో తిరుగుతున్నారు. పావురాలు మూలుగుతున్నాయి. సూరన్నతాత వేణ్ణీళ్ళతో ముఖం కడుగుకొంటున్నాడు. రొజ్జగాలి చివరితీవ్రత ప్రదర్శిస్తోంది. కాకులు కఠోరంగా అరుస్తు న్నాయి. ఆ అరుపు విని నూకయగారు భయంకొద్దీ పావురాలని పిలిచి వెతుకుతున్నారు. ఏదో దెబ్బ తిన్నదని అనుమానం.

మూర్తి లేచాడు. లేస్తూనే తన జీవితాన్ని అసహ్యించు కొన్నాడు. తనకి చక్కని సంసారజీవితం కావాలి. సాయం కాలం యింటికి వచ్చేసరికి ఆత్రపడే తల్లి, కొడుకు ప్రయోజ కత్వంతో మురిసిపోయే తండ్రీ, కోరికలన్నీ కోరే చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ, ఓరచూపులో పూలపాట్లాం వెదికే భార్యా, మునిమనుమలతో కనులుపండువుగా ఆడుకొనే తాతయ్యా, అందరూ వుండే నిండు సంసారం తనకి కావాలి. కానీ—

కళ్ళు బరువుగా యెత్తి చూసేసరికల్లా కారుణ్య స్నానంచేసి పవిత్రంగా వస్తోంది. లేతాకురంగుచీర ఆమె అవయ వాలకు అంటుకొంది. 'ఇంత చలిలోనా స్నానం! అబ్బ!' అని గొణిగాడు. ఆమె నవ్వుకొంది. ఆ నవ్వు చాలు తన జీవితానికి! దానితో సంతృప్తిపొందే హృదయం చాలు అతని సంతృప్తికి.

తాతా, రాత్రీ—జ్ఞాపకం! తాత తెచ్చిన సమస్యలు. ఆ సమస్యలకు తన సమాధానం ఒకటే! కుమారుడు తండ్రి యొక్క ఆస్తి, హక్కు కాకూడదు. అలా సంఘం నిర్మించి వుంటే ఆ సరిహద్దులు విశాలం చేయడమే' తన లక్ష్యం! తమ సంతతి అనుభవిస్తున్న సౌఖ్యాలకి ఆనందించాలి. గర్వ పడాలి. అదే తమ ఆస్తిగా భావించాలి. జీవితాలని, హృదయా లని, అనుభవాలని సంకుచితపరచే జాతి, నీతి, మతాలతో పెన వేసుకొన్న సాంఘికాచారాలు పునః సృజించబడి కొత్త విలువ లతో విశాలత సాధించాలి. ఆ ఆశయంకోసం సిద్ధపరచిన తన అసువులు యింకో విధంగా దుర్వినియోగం చేయలేడు.

సూర్యకాంతితో లోకం నిండిపోయింది. మూర్తి తన మనోభావాలు జంకు గొంకు లేక చెప్పేయాలనుకొని వీగి పోతున్నాడు. కారుణ్యా జాలిగా చూస్తోంది. కాఫీ చేసి అందరికీ యిచ్చింది. దండాశి మందారాలతో నిలువెత్తు హారం దేవికోసం గుచ్చాడు. రక్తధారలావుంది మాల. దేవిని చూడాలని తహ తహలాడుతున్నాడు సూరన్నతాత.

నూకయగారు వచ్చి 'చూశారా? ఆ తెల్ల పావురం పిల్లని డేగ పొడిచేసింది. ఏం చేశాయీ పావురాలన్నీ? రక్షించ గలి గాయా? తమప్రాణాల కెక్కడ ప్రమాదమోనని బాధ పడ్డాయి. యిపుడు వాటి పనుల్లో అవి మునిగిపోయాయి. అది అందంగా తిరిగితే—అన్నీ దానివెంట పడేవే—కాని—అల్పజీవి! అంతే నండి యీజీవితం' అని ముగించి ఆలయంలోకి వెళ్లిపోయారు.

సూరన్నతాత చాలసేపు ఆలోచించాడు. తను యీ విశ్వంలో జీవించిన దినాలన్ని జీవితాలు చూశాడు. అవి బోధిం చిన సత్యం యేమిటో—అతని కళ్ళల్లో అశ్రువులు నిండడం కారుణ్యా చూసింది. తనే ఆ వృద్ధుని కన్నీటికి కారణమని చివు క్కుమం దామెహృదయం. బాధతో ఆమె కనుకొలకుల్లో నీరు సుళ్ళు తిరిగింది.

సూరన్న తాతలో సముద్రమంత అశాంతీ, ఆకాశమంత నిరాశా అలుముకొన్న క్షణాల్లో సూర్యకాంతివంటి సౌందర్యం, హృదయాలని బంధించే సంగీతంలా మూర్తి, కారుణ్యా కన్పించారు.

వెళ్లిపోతానని తొందరచేసిన తాతయ్య యెవరాపినా, బ్రతిమాలినా ఆగలేదు. ఆలయంలోని దేవికి తొలి సారిగా, ఆఖరిసారిగా వందనంచేసి బయటడుగుపెట్టి నూకయ్యగారితో 'నీవే అన్నీ స్వామీ—' అని తిరుగుదారి పట్టాడు. మలుపు తిరిగే సరికి దూరాన కొండల వెనక మహేంద్రగిరి నీలంగా, నిశ్చ లంగా ప్రకాశిస్తూ కన్పించింది. ఇంతలో ఓ బస్‌వచ్చి సూరన్న తాతని యెత్తుకు పోయింది గమ్యం వేపు.